తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# గజవాహనంపై గజలక్ష్మి





తిరుచానూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం రాత్రి అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన, విశేషమైన గజవాహనంపై లోకమాతగా భక్తులను అనుగ్రహించారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. అడుగడునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఇందులో భాగంగా గజవాహనం సందర్భంగా లక్ష్మి కాసుల హారాన్ని తిరుమల శ్రీవారి ఆలయం నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమాలల్లో టిటిడి ఈఓ ధర్మారెడ్డి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, విఎస్ఓ మనోహర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాము, తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతికి వెంకన్న లక్ష్మీకాసులహారం



తిరుచానూరులో కన్నుల పండువగా జరుగుతున్న పద్మావతి అమ్మవారి కార్తీకబ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు గురువారంరాత్రి జరిగిన గజవాహనసేవలో, శుక్రవారం జరిగే గరుడసేవలో అమ్మవారికి అలంకరించేందుకు తిరుమల నుంచి బంగారు లక్ష్మీకాసుల హారాన్ని పంపారు. టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, అర్చకులు ఆలయంలో పూజలు నిర్వహించి, మాఢవీధుల్లో ఊరేగింపుగా తిరుచానూరుకు తలపై పెట్టుకుని తీసుకెళ్ళారు.

## చిత్తూరు జిల్లాకు భారత రిజర్వ్ దళం



భారత రిజర్వ్ దళం ఏర్పాటుకు పోలీసుల ప్రాతిపాదిత స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్.

చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వైపరీత్యాలు, ఇతర దేశాల నుండి వచ్చే ముప్పు, ఉగ్రవాదుల చర్యలు వంటి కార్యక్రమాలను అణచి వేయడానికి రాష్ట్రానికి నాలుగు రిజర్వ్ దళాలను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్రానికి మంజూరైన నాలుగు రిజర్వ్ దళాలను ఒకటి చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో భారత రిజర్వ్ దళం ఏర్పాటుకు 40 ఎకరాల స్థలం అవసరమని జిల్లా కేంద్రం చిత్తూరుకు సమీపంలో ఈ దళం ఏర్పాటుకు అవసరం అయిన స్థలంను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా యంత్రాంగం కేటాయించిన స్థలం వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంకు పంపడం జరుగుతుందని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈ మేరకు అడ్మిన్ ఎఎస్పీ జగదీస్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌లను కలిసి భారత రిజర్వ్ దళం ఏర్పాటుకు కొన్ని ప్రతిపాదిత స్థలాలను చూపించారు. ఎంటిఓ మధు పోలీసు శాఖ ప్రతిపాదించిన స్థలాల్లో పరిశీలించి ఒక స్థలంను ఖరారు చేయాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కోరారు.

### ఏనుగుల దాడిలో పంట నష్టాన్ని పరిశీలించిన

## అడిషనల్ పిపిఎఫ్ వైల్డ్‌లైఫ్ అధికారిణి



పలమనేరు, నవంబర్ 24, ప్రభాతవార్త:
పలమనేరులో ఏనుగుల దాడిలో నష్ట పోయిన పంటలను అడిషనల్ పిపిఎఫ్ వైల్డ్‌లైఫ్ అధికారిణి శాంతిప్రియా పాండే గురువారం పరిశీలించారు. మండలంలోని పలు ప్రాంతాలలో ఏనుగుల దాడిలో రైతులు పంటలను నష్టం జరుగుతున్న క్రమంలో డిఎఫ్ఓ చైతన్య కుమార్, ఎఫ్ఆర్ఓ నయిమ్ అలీఆధ్వర్యంలో పెంగరగుంటలో ఏనుగుల దాడిలో జరిగిన పంట నష్టంను పరిశీలించారు. ఈ మేరకు అక్కడి రైతులు ఇప్పటి వరకు జరిగిన పంట నష్టంను వివరించారు. సోలార్ ఫెన్సింగ్ ద్వారా ఏనుగుల దాడి నుండి పంటలను రక్షించుకోగలమని తెలపగా దీనిపై ఆమె స్పందిస్తూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.

### పిఎస్ఎల్‌వి సి-54 ప్రయోగానికి

# నేటి నుంచే కౌంట్‌డౌన్



- షార్‌లో ముగిసిన ఎంఆర్ఆర్, ఎల్ఎబి సమావేశాలు
- నేడు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ రాక
- రేపు మధ్యాహ్నం 11.56 గంటలకు రాకెట్ ప్రయోగం

శ్రీహరికోట (తడ), నవంబర్ 24 ప్రభాతవార్త
నిన్న మొన్నటి దాకా శ్రీహరికోటలో భారీవర్షాలు మబ్బులతో ఉన్న వాతావరణం నేడు ప్రశాంతంగా మారింది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై పిఎస్ఎల్‌వి సి-54 నింగికి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. దీనికి తగ్గట్లే ఇస్రో శాస్త్రవేత్తలు గురువారం కీలక సమావేశాలు నిర్వహించారు. మొదట మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్)ను ముగించి, ఆ వెంటనే లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ (ఎల్ఎబి) సమావేశం పూర్తి చేశారు. ఈ సమావేశాలలో రాకెట్ ప్రయోగానికి ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్ధారించారు. ముందుగా అనుకున్నట్లే మధ్యా హ్నం 11.56 గంటలకు పిఎస్ఎల్‌వి సి-54 ప్రయోగ సమయాన్ని ఖరారు చేశారు. 25 గంటల 30 నిమిషాల పాటు కౌంట్‌డౌన్ సమయాన్ని నిర్ధారించారు. శుక్రవారం ఉదయం 10.26 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. రెండు, నాలుగు దశలలో ద్రవ ఇంధనాన్ని నింపడం, రాకెట్‌లోని వివిధ దశలను సరిచూసుకోవడం కౌంట్‌డౌన్ ప్రక్రియ. ఇదిలావుంటే శుక్రవారం ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ షార్‌ను చేరుకొని ప్రయోగ సన్నాహాలలో భాగం పంచుకోనున్నారు. ఎన్ఎస్ఐఎల్ ఆధ్వర్యాన ఇటీవల వరుసగా జరుగుతున్న రాకెట్ ప్రయోగాలలో పిఎస్ఎల్‌వి సి-54 కూడా చేరింది. ఈ రాకెట్ ద్వారా భారతీయ భూపరిశీలన ఉపగ్రహం ఇఓఎస్-06ను 17 నిమిషాల 21 సెకన్ల వ్యవధిలో భూమికి 743 కిలోమీటర్ల సూర్యానువర్తన ధ్రువ కక్ష్యలో ప్రవేశపెట్టాల్సి ఉంది. అనంతరం మరో ఎనిమిది నానో ఉపగ్రహాలను అంతరక్షంలోని వేరే కక్ష్యల్లో భూకేంద్రాల నుంచి రాకెట్‌లోని నాల్గవ దశను నియంత్రించి ప్రవేశపెడతారు. ప్రయోగం మొత్తం పూర్తి కావడానికి రెండుగంటల 15 నిమిషాలకు పైగా సమయం పడుతుంది.

### తెలుగుజాతి పౌరుషదీప్తి

## ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి

### మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరులో ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు, నవంబరు 24 ప్రభాతవార్త :
స్వాతంత్ర్య పోరాటాన్ని రాష్ట్రంలో ఒక వ్యక్తిగా ప్రారంభించి వందలాది మంది మద్దతుదారులతో బ్రిటీష్‌పాలకులను వణికించిన ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి తెలుగుజాతీ పౌరుషానికి పూచిన ఖడ్గమని, ఆయన పోరాటం మహామహులకు స్ఫూర్తిగా నిలిచిందని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, భూగర్భగనులశాఖల మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ఉయ్యాల వాడ జయంతి సందర్భంగా గురువారం హైవే బైపాస్‌రోడ్డులో రెడ్డిజనసంక్షేమసంఘం ఏర్పాటుచేసిన కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఒకరికింద బానిసగా బతకడం కంటే పోరాడి ప్రజ్వరిల్లడం ఉత్తమమని భావించిన ఉయ్యాలవాడ బ్రిటీష్ వారు ఇచ్చే భరణాన్ని తీసుకోక ఎదిరించి నిలిచారన్నారు. అటువంటి యోధుడిని వంచనతో బ్రిటీష్‌ప్రభుత్వం పట్టుకుని ఉరితీయించిందన్నారు. తండ్రి మరణానంతరం ఓదార్పుయాత్రకు వెళ్లడానికి అనుమతించక తమ బానిసత్వంలోనే ఉండాలనే హుకుంతో కాంగ్రెస్ వ్యవహరించడంతో తమ నేత, నేటి సిఎం జగన్మోహన్‌రెడ్డి స్వతంత్ర్యంగా పోరాడడానికి సంకల్పించడంతో 16నెలలు జైలులో ఉంచారన్నారు. చివరకు ప్రజలు కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసి జగన్‌ను సిఎం చేశారన్నారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి విగ్రహాన్ని రాష్ట్రస్థాయిలోనే ఎక్కడా లేనివిధంగా వ్యయప్రయాసలతో ఏర్పాటుచేసిన సంఘస్తులను ఆయన అభినందించారు. ఎంపి మిధున్‌రెడ్డి మాట్లాడుతూ తరాల స్ఫూర్తిగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని పుంగనూరులో ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమన్నారు. పుంగనూరు ప్రజలకు ఇంకా రుణపడి ఉన్నామని, మూడు ఎన్నికలలో వారు ఎంతో భరోసాతో భారీమెజార్టీతో విజయం అందించారన్నారు. పుంగనూరులో ఇంకా అభివృద్ధికార్యక్రమాలు అందించడానికి సిద్దంగా ఉన్నామన్నారు. 2014లో ప్రభుత్వం పుంగనూరు అభివృద్ధిని అడ్డుకుందన్నారు. నేడు సిఎం జగన్ సారథ్యంలోనే పుంగనూరులో అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో పుంగనూరులోని అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరందించేందుకు భారీ ఎత్తున కార్యాచరణ సాగుతోందన్నారు. అన్నిరోడ్లు పుంగనూరులోనే వేస్తున్నామని చంద్రబాబు బాధపడుతున్నారని, వారి హయాంలో ఎందుకు వేయలేదో చెప్పాలన్నారు. బెంగళూరు నుంచి పుంగనూరు మీదుగా తిరుపతికి హైవేవేయాలని సిఎం జగన్ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీను కోరారన్నారు. కార్యక్రమంలో ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి, ఎంపికే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఛైర్మన్ అలీంతో పాటూ రెడ్డిసంఘస్తులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కోట, నవంబర్ 24 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల అధినేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారు. 2014 వరకు నేదురుమల్లి రామ్‌కుమా ర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. అనంతరం వైసీపీలో చేరారు. వైసీపీ తిరుపతి, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గాలకు గత ఎన్నికల్లో పరిశీలకులుగా పనిచేశారు. గూడూరు డివిజన్‌లోని వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో నేదురుమల్లి ఫౌండేషన్ పేరుతో ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేశారు. పార్టీలో చురుగ్గా పనిచేస్తున్న నేదురుమల్లి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమించారు. దీంతో నేదురుమల్లి వర్గం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## చిత్తూరుజిల్లా అధ్యక్షుడిగా నారాయణస్వామి



చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
జిల్లా వైకాపా అధ్యక్షుడిగా మరోసారి డిప్యూటీ సిఎం నారాయణ స్వామి నియమితులయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా నారాయణస్వామి కొనసాగారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అప్పటి వరకు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా వున్న నారాయణస్వామికి మంత్రి వర్గంలో డిప్యూటీ సిఎంగా అవకాశం కల్పించి కుప్పం నియోజకవర్గం నుండి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడుపై పోటీ చేసి ఓటమిపాలైన భరత్‌ను నియమించారు. ఆపై భరత్‌కు ఎమ్మెల్సీ పదవి వరించింది. అప్పటి నుండి ఎమ్మెల్సీ భరత్ చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వైకాపా అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా గురువారం జిల్లా వైకాపా అధ్యక్షులను నియమిస్తూ చర్యలు తీసుకొంది. ఈ మేరకు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా మరోసారి డిప్యూటీ సిఎం నారాయణస్వామిని నియమిస్తూ వైకాపా అధిష్టానం నిర్ణయం తీసుకొంది.

### ఏడాది ఆఖరుకు పెండెన్సీ కేసులు

# 50 శాతం పరిష్కారం

- అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్



చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
ఈ ఏడాది ఆఖరు నాటికి అనంతపురం రేంజ్ పరిధిలో వున్న పెండెన్సీ కేసులు 50 శాతం పరిష్కరించాలని అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతపురం రేంజ్ డిఐజి కార్యాలయం నుండి డిఐజి ఎం.రవిప్రకాష్ గురువారం రేంజ్ పరిధిలోని ఎస్పీలు, ఎఎస్పీలు, డీఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అండర్ ఇన్విస్టిగేషన్ కేసులు 2,796, తిరుపతి జిల్లాలో 4,486 కేసులు వున్నాయని, గత లోక్ అదాలత్ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాలో ఈ కేసుల సంఖ్య బాగా తగ్గించారని, తిరుపతి జిల్లాలో సైతం ఈ కేసులను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఈస్ట్, వెస్ట్, గూడూరు సబ్ డివిజన్ల పరిధిలో అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై దృష్టి సారించి వాటి సంఖ్యను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాల్లో రెడ్ విలేజ్ స్థాయి నుండి గ్రీన్ విలేజ్‌గా మారిన గ్రామాల్లోని పరిస్థితులపై ఆయన అధికారులతో సమీక్షించారు. మిగిలిన రెడ్ విలేజ్‌లు గ్రీన్ విలేజ్‌లుగా మార్చడానికి పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పాత లిక్కర్, ఐడి అఫెండర్స్‌కు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల అడ్డుకట్ట వేయడంపై పోలీసు అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో చిత్తూరు నుండి ఎస్పీ రిశాంత్‌రెడ్డి, తిరుపతి నుండి ఎస్పీ పరమేశ్వర్, ఆయా సబ్ డివిజన్ల నుండి డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల కార్యాలయాల నుండి ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

### గడప గడపకు - మన ప్రభుత్వంలో మంజూరైన పనులను

# సత్వరమే ప్రారంభించాలి

- జిల్లాలో అనీమియా నివారణకు చర్యలు చేపట్టాలి
- హౌసింగ్ లే అవుట్‌లలో నిర్మాణాలు వేగవంతం చేయాలి
- బడి బయటి పిల్లలను బడిలో చేర్చి, విద్యార్థులు హాజరుశాతం పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి సమీర్ శర్మ

తిరుపతిరూరల్, నవంబర్24 ప్రభాతవార్త:
గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన పనులను సత్వరమే ప్రారంభించి, పనులను వేగవంతం చేయాలి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ అన్ని జిల్లాల కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్స్‌ను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి ముఖ్యకార్యదర్శి, స్పెషల్ సి.ఎస్. అజయ్ జైన్‌లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి. డికె.బాలాజీ సంబంధిత అధికారులతో హజరయ్యారు. ఈ వీడియో సమావేశంలో సి.ఎస్.సమీర్ శర్మ మాట్లాడుతూ ఏ.పి. సేవా సర్వీసులు పెంచాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దేశిత 8 ఇండికేటర్‌లు, 4పారా మీటర్ల వారీగా రక్తహీనత, పోషక ఆహార లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు, కౌమార దశ అమ్మాయిలకు అనీమియా తగ్గించుటకు, పౌష్టిక ఆహారం, ఐరన్ మాత్రలు అందేలా వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ డి.ఈ.ఓ. సంక్షేమశాఖల అధికారులు చర్యలు తీసుకుని పురోగతి చూపించాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థుల నమోదు, డ్రాపౌట్స్ సంఖ్య సమీక్షించుకుని బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించే దిశగావిద్యాశాఖ అధికారులు, సచివాలయ ఎడ్యుకేషన్ ఎనిమిటి సెక్రటరీలు, వాలంటీర్లు పర్యవేక్షించి కన్సిస్టెంట్ రిథం యాప్‌లో నమోదు చేసి, ఎపటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ సి.ఎస్. అజయ్ జైన్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం వినతులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, నవరత్నాలు, పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్ లే అవుట్‌లలో అన్ని మౌలిక వసతులు కల్పించి, నిర్ధేశించిన గడువులోపల పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పిఎంఎవై గ్రామీణ్ మీద దృష్టి పెట్టాలని, జియో టాగింగ్ మంజూరు రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. ఆప్షన్-3 ఇళ్లకు ఎస్.హెచ్.జి.ల ద్వారా లోన్లు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న తోడు ఫేస్-5కు సంబంధించి మెప్మా అధికారులు డిసెంబర్ ఆఖరిలోపు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. వైయస్సార్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సర్వే ఏ.డి. జయరాజ్, జిల్లా ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారి అశోక్‌కుమార్, డిఎల్‌డిఓ సుశీలాదేవి, జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ అధికారిణి జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు
24/11/2022



- తిరుపతి 25 డిగ్రీలు
- చిత్తూరు 27 డిగ్రీలు
- మదనపల్లి 19 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 26 డిగ్రీలు
- వెంకటగిరి 26 డిగ్రీలు
- గూడూరు 27 డిగ్రీలు

## బంగారం ధరలు
24/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,931
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,378

## కోడిగ్రుడ్ల ధరలు
24/11/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00
1 డజను: రూ.60.00

## ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన డిప్యూటీ సిఎం

4లో





## పెద్దపంజాణి మండల మీట్‌లో ప్రోటోకాల్ రగడ

4లో

# రక్తహీనత గుర్తించి చర్యలు

## - వైద్య అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ దిశా నిర్ధేశం

చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త: 10-19 సంవత్సరాల వయస్సు మధ్య గల బాలికలు, బరువు తక్కువ గల పిల్లల్లో రక్తహీనత గుర్తించి అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరినారాయణన్ వైద్య, ఐసిడిఎస్, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రక్తహీనత, బరురు తక్కువ వున్న పిల్లలను సచివాలయాలను యూనిట్‌గా తీసుకొని పర్యవేక్షించాలన్నారు. వీరిని



మానిటరింగ్ చేయడానికి ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లతో పాటు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు సైతం ప్రస్తుతం అందుబాటులో వున్నాయ న్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో కలిసి ఈ పని పక్కాగా చేయాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఐసిడిఎస్ పిడి నాగశైలజలను కలెక్టర్ ఆదేశించారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో 16,897 గర్భిణీలు వుండగా వీరిలో 9,081 మంది మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఇందులో 4,898 మందికిరక్తహీనతలేదని, 4,015 మందికి 10 నుండి 10.9 గ్రాముల వరకురక్తహీనతవుందని,అలాగే166 మందికి 7 నుండి 9.9 గ్రాముల రక్తహీనతవుందని,మరో11,359 మందికి పరీక్షలు చేయా ల్సి వుందని కలెక్టర్‌కు వివరించారు.డిఐఓ విజయేంద్రరావు, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావ్, డిఐఓ డాక్టర్ రవిరాజు, డిఎస్‌ఓ డాక్టర్ సుదర్శన్, డిప్యుటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ హరినాధరెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పరిమళించిన మానవత్వం.. పేదలకు దుప్పట్లు పంపిణీ



కుప్పం, నవంబర్ 24 ప్రభాతవార్త
చలికాలంలో రోడ్డుపక్కన ఉన్నవారు, అభాగ్యులు పడు తున్న ఇబ్బందులను గుర్తించి మేమున్నాం అంటూ కుప్పం సమాచారం సభ్యులు ముందుకు వచ్చారు. గురువారం రాత్రి కుప్పం పట్టణం అంతా తిరిగి ఫుట్‌పాత్‌పై ని ద్రించేవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ పేదలకు తమవంతు సాయంగా దుప్పట్లు అందించామన్నారు. ఈ సందర్భంగా తమకు సహకారం అందించిన దాతలకు కృతజ్ఞ తలు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం సమాచారం సభ్యులు పాల్గొన్నారు.

### లయన్స్‌క్లబ్‌చే 15వేల ఆర్థిక సాయం



కుప్పంరూరల్, నవంబర్ 24 ప్రభాతవార్త
కుప్పం పట్టణంకు చెందిన విలేకరి మంజు ఇటీవల ఆటో ప్రమాదంలో తీ వ్రంగా గాయపడ్డాడు. ఇతను నడిచే స్థితిలో సైతం లేదు. ఈనేపథ్యంలో గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్ అధ్వర్యంలో అతనికిరూ 15వేల ఆర్థికసాయం అందించారు. అలాగే నిత్యావసర సరుకులు సైతం అందిస్తా మన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అడ్మినిస్ట్రేటర్ సెల్వం, కోశాధికారి సెంధిల్‌కుమార్, సభ్యులు సుబ్రమణ్యం, శివ, మతీన్, కలీం, గని, కుప్పం సమాచారం సభ్యులు పాల్గొన్నారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం

బంగారుపాళ్యం, నవంబర్ 24 ప్రభాతవార్త:
స్థానిక బంగారుపాళ్యం జూనియర్ కళాశాలలో ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యకరమైన జీవితంను పొందాలని సూచించారు. ఇందుకు ప్రతినిత్యం ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రా ఆఫీసర్ పి.మురళీ, అధ్యాపకులు నాగలక్ష్మీ, విజయబాబు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### టిబి ముక్త భారత్‌కు రెవెన్యూ ఉద్యోగుల సంఘం రూ.1 లక్ష విరాళం

చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంకు చిత్తూరు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఒక లక్ష రూపాయల విరాళంను గురువారం కలెక్టర్ హరినారాయణన్‌కు అందజేశారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమరనాథ్, కార్యదర్శి హుస్సేన్, నాయకులు పార్థసారధి, హేమాద్రి, శివకుమార్, శోభ, రేఖలు ఉద్యోగుల తరపున ఈ చెక్కును కలెక్టర్ హరినారాయణన్‌కు అందించారు. ఈ సందర్భంగా ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులను కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

### నూతన పీసీసీ అధ్యక్షుడి నియామకంపై కాణిపాకంలో పూజలు

కాణిపాకం, నవంబర్ 24 ప్రభాతవార్త:
పీసీసీ నూతన అధ్యక్షుడిగా గిడుగు రుద్రమరాజు నియామకం కావడంతో కాణిపాకం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు పీసీసీ డెలిగేట్ సభ్యుడు ఏపీ పరదేశి తెలిపారు. ఏపీసీసీ నూతన అధ్యక్షుడిగా గిడుగు రుద్రమరాజు, కార్యనిర్వాహణ అధ్యక్షులుగా మస్తాన్‌వల్లి, జంగా గౌతమ్ సుంకర పద్మశ్రీ రాకేష్‌రెడ్డిల నియామకం కావడంతో వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రావాలని కోరుతూ దేశంలో స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ఏపీసీసీ, డీసీసీ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అధిక ప్రాధాన్యత నివ్వాలని తద్వారా పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఏపీ పరదేశి తెలిపారు. అలాగే గ్రామస్థాయి నుండి పార్టీ పదవులతో పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

### షిర్డీసాయిబాబా ఆలయంలో విశేష పూజలు

చౌడేపల్లి, నవంబర్ 24 ప్రభాతవార్త
స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు పృద్వీ నవీన్ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉభయదారుల చే తీర్థ ప్రసాదాలందించారు.

### అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ.10,116ల విరాళం



కుప్పం, నవంబర్ 24 ప్రభాతవార్త
రాష్ట్ర ఐ టిడిపి అధ్యక్షుడు చింతకాయల విజయ్ జన్మదినం స ంద ర్భంగా కుప్పం ఐటిడిపి విభాగం నేతలు కుప్పంలో నిర్వహిస్తున్న మొ బైల్ అన్న క్యాంటీన్‌కు రూ 10,116ల విరాళ ంను అందజేశారు. అంత కుముందు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కు మార్,నేతలుబిఎంకెరవిచంద్ర,త్రిలోక్, వినోద్,బాలాజీ, నరేష్, కౌన్సిలర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### మెను ప్రకారం మధ్యాహ్న భోజనం

బంగారుపాళ్యం, నవంబర్ 24 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని డిప్యుటీ డిఐఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం గుండ్లకట్టమంచి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనంను ఆయన పరిశీలించి రుచి చూశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెనును మార్పు చేసిందని దానికి అనుగుణంగా విద్యార్థులకు రుచికరమైన భోజనంఅందించాలన్నారు.అలాగేనాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వంటగది, విద్యార్థుల మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే టెన్త్ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యాబోధన

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

### నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



కుప్పంరూరల్, నవంబర్ 24 ప్రభాతవార్త
మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులను వేగవంతం చేయాలని ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ప్లానింగ్ కో ఆర్డినేటర్ దాము సూచిం చారు. గురువారం ఎంఇఓ కార్యాలయంలో వారు సిఆర్‌పిలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రెండో విడత నాడు -నేడు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సిఆర్‌పిలను ఆదేశించారు. పనులకు సంబంధించి సకాలంలో ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు.ఎంఇఓ మహబూబ్ బాషా, కేశవులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

### గడప గడపతో ప్రజలకు మరింత అందుబాటులో

-ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ



బైరెడ్డిపల్లె, నవంబర్ 24 ప్రభాతవార్త:
గడపగడప కార్యక్రమంతో వైకాపా ప్రభుత్వం ప్రజ లకు మరింత అందు బాటులో ఉంటు వారి సమస్య లను తక్షణం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే డా.వెంకట గౌడా తెలిపారు.మండలంలో గురువారం గడపగడప కు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగినాయని పల్లెలో పర్యటించా రు.ఈ మేరకు ఆయన ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి కృషి చేశారు.ఎల్లప్పుడు ప్రజల సమస్యలపరిష్కారంకోసం తాముఅందుబాటులోఉంటామనిప్రజలకుఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పిటిసి కేశవులు,ఎంపిటిసి లక్ష్మమ్మ,సర్పంచులు శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో గజరాజుల హల్‌చల్

బైరెడ్డిపల్లె,నవంబర్ 24,ప్రభాతవార్త:
మండలంలో బుధవారం గజరాజులు హల్‌చల్ చేశాయి.మండలంలోని గౌనితిమ్మేపల్లె,కడపనత్తం, వెంగంవారిపల్లె,కడతాట్లపల్లె,కుప్పనపల్లె గ్రామాలలో సుమారు 15 ఏనుగుల గుంపు ఒక్క సారి పంట పొలాలపై దాడులు చేసి భారీగా పంట నష్టం చేశాయి. గత 4నెలలుగా మండలంలో ఏనుగుల గుంపు రాత్రి సమయంలో పంటపొలాలపై దాడి చేస్తున్న క్రమంలో రైతులు రాత్రి సమయంలో పంటపొలాలకు పోవడానికి సైతం భయపడుతున్నారు.అధికారులు ఏనుగుల నుండి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు అధికారులను కోరుతున్నారు

### పట్టణంలో హోటళ్ళపై ఆహార భద్రత అధికారులు దాడులు

-పలు హోటళ్లలో పరీక్షలకు ఆహార పదార్థాల సేకరణ

పలమనేరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
పలమనేరు పట్టణంలోని పలు హోటళ్ళపై గురువారం ఆహార భద్రత శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఫుడ్ ఇన్స్పెక్టర్ సతీష్ సిబ్బందితో పలు హోటళ్ళలలో దాడులు నిర్వహించి పరీక్షల కోసం ఆహార పదార్థల సేకరించారు.పట్టణంలో అధిక సంఖ్యలో హోటళ్ళు ఉన్నప్పటికి ఏ ఒక్క హోటళ్ళలో ప్రభుత్వ ప్రమాణాలు,నిర్వహణ లేదన్న విషయం అందరికి తెలిసిందే.ఈ క్రమంలో ఆహార భద్రత అధికారులు పట్టణంలో దాడులు నిర్వహించడం పరీక్షలకు ఆహార పదార్థలను సేకరించడంతో పరీక్షల అనంతరం ఎన్ని హోటళ్ళపై చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

### సిఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ రాజ్యం

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి, నవంబర్ 24 ప్రభాతవార్త:
రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ రాజ్యం ఏర్పాటు అవుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. యాదమరి మండలం మాధవరం పంచాయతీ పరిధిలోని మాధవరం, మాధవరం ఎఏడబ్ల్యు కాలనీల్లో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరగా పరిశీలించి పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, ఎంపిపి సురేష్‌బాబు, తహసిల్దారు చిట్టిబాబు, ఎంపిడిఓ శివరామ్, ఎఇలు జయచంద్రారెడ్డి, నవీన్, ఎపిఓ కవిత, ఎంఇఓ రుక్మిణి, వైస్ ఎంపిపి రవీంద్ర, మాజీ జడ్పీటిసీ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల, నవంబర్ 24 ప్రభాతవార్త:
అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికా రులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని వెంగమాంబాపురం గ్రామ పంచాయతీలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులతో మాట్లాడి పథకాలు అందాయా! లేదా! అని ఆరా తీశారు. ప్రజలు స్థానిక



సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిడిఓ ఉపేంద్ర, తహసిల్దారు బాబురాజేంద్రప్రసాద్, మండల వైకాపా అధ్యక్షుడు జనార్ధన్, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వైకాపా నాయకులు శ్యామూల్‌బాబు, రజనీకాంత్, శింబు, సుధాకర్‌నాయుడు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

### 30న సెబ్‌స్టేషన్‌లో బహిరంగ వాహనాలు వేలం

వాకాడు, నవంబర్ 19, ప్రభాతవార్త
ఈ నెల 30న గూడూరు సెబ్ స్టేషనులో బహిరంగంగా వాహనాలు వేలం జరుగుతుందని వాకాడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం వాకాడు సెబ్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలోని ఉన్నటువంటి సెబ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను ఈ నెల 30న డివిజన్ పరిధిలోని గూడూరు సెబ్ స్టేషన్‌లో వాహనాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలోనే వాకాడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో ఉన్న పల్సర్ బ్లాక్ కలర్ బైక్, ఎల్లో కలర్ బజాజ్ ఆటో గూడూరు సెబ్ స్టేషన్‌లో బహిరంగంగా వేలం జరుగుతాయని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ధారావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆమె కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే వాహనాలు రేట్లు వేయడం జరిగిందని అన్నారు. ఆమె వెంట సిబ్బంది తదితరులు వున్నారు.

### చిన్నపాటి వర్షానికే అమ్మపాళెం వీధులు బురదమయం

వెంకటగిరి నవంబరు 24 ప్రభాతవార్త



మండలంలోని అమ్మపాళెం గ్రామంలోని వీధులు చిన్నపా టి వర్షానికే బురద మయంగా మారాయి. వీధుల్లో నడచివెళ్ల డానికి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్రవాహ నాలు, ఆటో లు కాని వెళ్ళలేకున్నట్లు వాపోయారు.ఎప్పుడు వర్షంపడినా రోడ్లు చిత్తగా మారుతున్నట్లు గ్రామస్తులు వాపోతు న్నారు.రోడ్లు బురద మయంగా మరడంతో నడవలేక పిల్లలు,పెద్దలు అవస్థలు పడుతున్నారు. వీధుల్లో నీరు నిలిచి దుర్గంపూరితమైన వాసనలు వస్తున ్నట్లు తెలిపారు.దోమలకూడా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు.పాలకులు పట్టించు కోవడంలేదని స్థానికులు ఆరోపించారు.ఉన్నతాధికారులుచర్యలు తీసుకొని సిమెంట్ రోడ్లను వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

### వెంకటగిరిలో పందుల స్వైరవిహారం

ఆందోళన చెందుతున్న పట్టణప్రజలు

వెంకటగిరి నవంబరు 24 ప్రభాతవార్త
పట్టణంలో విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా పందులు తిరుగు తున్నాయి.వీటివల్ల చిన్నపిల్లలకు మెదడు వాపు వ్యాపు తదితర వ్యాధులు ప్రబలుతాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని రాజవీధి,తూర్పువీధి,శివాలయం వీధి తదితర చోట్ల పందుల సంచారం ఎక్కువగా ఉన్నాయి. కాగా పందులను రెండు రోజుల్లో యజమానులు తీసుకొని వెళ్లక పోతే వీటిని వేరొక చోటకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు. పందుల యజమానులకు ముందుగా సమాచారం ఇచ్చామన్నారు.

### నేదురుమల్లి వర్గం సంబరాలు

కోట, నవంబర్ 24 ప్రభాతవార్త



దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ద న్‌రెడ్డి తనయుడు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప ్మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం పట్ల నేదురుమల్లి వర్గం హర్షం వ్యక్తం చేసింది. ఆ మేరకు గురువారం మండలంలోని విద్యానగర్‌లో సర్పంచ్ దేవారెడ్డి మాధవి, వైసీపీ నాయకులు దేవారెడ్డి నాగూర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా నాగూర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో రానున్న ఎన్నికల్లో శాసనసభ్యులను గెలిపించుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తారని తెలిపారు. విద్యానగర్ నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు నాగూర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. కోట క్రాస్‌రోడ్డులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, షనీల్‌రెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య పాల్గొన్నారు.

### ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తాత్కాలిక పనులు చేపట్టండి

- ఆర్డీఓ కిరణ్‌కుమార్

కోట, నవంబర్ 24 ప్రభాతవార్త
కోటలోని ఆర్‌అండ్‌బి రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లు వర్షానికి మరింతగా గుంటలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ కోటలోని ఆర్‌అండ్‌బి రోడ్లను పరిశీలించారు. నేరుగా ఆర్‌అండ్‌బి కార్యాలయానికి వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడారు. కోట పట్టణంలో పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రోడ్డును ఆక్రమించుకొని ఉన్న వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, ఇతర అధికారులు ఉన్నారు.

### ఆనందంలో నేదురుమల్లి వర్గం



కోట, నవంబర్ 24 ప్రభాతవార్త
దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, ఎన్‌బికేఆర్ విద్యాసంస్థల అధినేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్ష పదవి రావడం పట్ల ఈ ప్రాంతంలోని నేదురుమల్లి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎంఎల్‌ఏగా, ఎంఎల్‌సీగా, ఎంపీగా, సీఎంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అంటున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో పార్టీని సమర్థవంతంగా ముందుకు నడపగల నాయకుడైన రామ్‌కుమార్‌రెడ్డిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం పట్ల నేదురుమల్లి వర్గం ఆనందం వ్యక్తం చేస్తోంది. పుచ్చలపల్లి మాజీ జలసంఘం అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

### హైవేపై పొంచి ఉన్న ప్రమాదం - ఆదమరిస్తే అంతే

దొరవారిసత్రం, నవంబర్ 24 ప్రభాతవార్త



ఆదమరిస్తే వెంటనే ప్రమాదం రోడ్డు అంచుల్లో పొంచి ఉంది. పేరుకే నేషనల్ హైవే 5. కానీ నిత్యం ప్రమా దాలు జరుగుతున్నా స్థానిక అధికారు లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ హరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నా యి.ప్రస్తుతంవర్షాలు ఎక్కువగా ఉండ టంతోజాతీయరహదారివెంబడి గుంట లు ఎక్కువై ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే ఆ గుంటల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో హైవే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారన్న విమర్శలు ఉన్నాయి. దొరవారిసత్రం మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఇరువైపులా సరైన లెవలింగ్ లేకపోవడంతో నిరంతరం ఎక్కడో ఒకచోట వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనికితోడు వర్షం ఎక్కువగా ఉండటంతో ఆ గుంటల్లోనే వర్షపు నీరు చేరి రాత్రి వేళల్లో ఆ గుంటల్లో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలబల్లి నుంచి సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వరకు 16 కిలోమీటర్ల వరకు రహదారి ఉంది. అక్కడక్కడ డాబాలు, చిల్లర దుకాణాలు, ఇతర దుకాణాలు ఉండటంతోఆగినవాహనాలుఅక్కడనుంచిబయటికిరాగానేఅధికంగాగుంటలుపడ్డాయి.ఈ గుంటల్నిఅప్పటి కప్పుడే పూడ్చి వాహనదారులకు సహకరించాల్సి న కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడం తో పలువురు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు స్పందించాలని పలు వురు కోరుతున్నారు.

### ఇంకా నిండని పాముల కాలువ

తడ, నవంబర్ 24 ప్రభాతవార్త



నవంబర్ నెల ముగుస్తున్నప్పటికీ తడ మండల పరిధిలో పంట కాలువలు పూర్తిగా నిండలేదు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో కరిపేటి కాలువ, పాముల కాలువలకు సగం మాత్రమే నీళ్లు చేరాయి. సాధారణంగా నవంబర్ మాసం అంటే ఈ రెండు కాలువలు ఉధృతంగా ప్రవహించి గట్లను దాటి ప్రవహిస్తుంటాయి. ఈ సారి ముఖ్యంగా పాముల కాలువ ఇంకా బురద నీటితోనే నిండి ఉంది. ఆ సమీపంలో వరిపంట వేసుకున్న రైతులు ఈ కాలువలో నీరు లేకపోతే పంట ఎలా కాపాడుకోవాలని ఇప్పటికీ దిగులు చెందుతున్నారు. కాళంగి నది నుంచి చెరువులకు నీటిని తీసుకెళ్లి నెర్రికాలువ కూడా ఇంకా పూర్తిగా నిండలేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు తక్కువ కావడంతో కాళంగి నదికి పాతిక శాతం నీళ్లు కూడా చేరలేదు. కరిపేటి కాలువకు మాత్రం మొన్నటి వర్షాలు సత్యవేడు ప్రాంతంలో కూడా కురవడంతోకొంతఎక్కువగా నీళ్లు చేరాయి. అయితే ఈ కాలువలో నీరు నిల్వ చేసుకునేందుకు చెక్‌డ్యాంలు లేనికారణంగా ఇప్పటికే వృధాగా పులికాట్ సరస్సులో కలిసిపోయాయి. మొత్తంమీద ఎన్ని అల్పపీడనాలు వచ్చినా ఇప్పటికీ తగినంత వర్షం కురవలేదని తడ మండలంలోని రైతన్నలు నిరాశగానే ఉన్నారు.

### రామ్‌కుమార్‌రెడ్డికి అభినందనలు వెల్లువ

కోట, నవంబర్ 24 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం పట్ల కోట మండలం పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షులు, వైసీపీ సీనియర్ నాయకులు దువ్వూరు వెంకటరమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సీఎంగా ఉన్నసమయంలోచెక్‌డ్యాంనిర్మించుకున్నామని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జనార్ధన్‌రెడ్డి వాకాడు బ్యారేజిని నిర్మించారని గుర్తు చేశారు. రామ్‌కుమార్‌రెడ్డి తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడైన నేపథ్యంలోజిల్లామంత్రులు,పార్లమెంటుసభ్యులు,ఎమ్మెల్యేలతోమరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని చెప్పారు. దీంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసే వీలుంటుందని చెప్పారు.

### రాజనేని ట్రస్టు సేవలు అభినందనీయం

చిల్లకూరు నవంబర్ 25 ప్రభాతవార్త
మండలంలోని చేడిమాల గ్రామంలో ఏర్పాటు అయి ఉన్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంతో మంది పేదవారికి సేవలు అందించడం అభినందనీయమని గూడూరు పట్టణానికి చెందిన అఖిల్‌కుమార్ అన్నారు. గురువారం ట్రస్టు ఏడవ వార్షికోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని గతంలో రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురై ఇంటికే పరిమితంగా ఉన్న అఖిల్‌కి 15 వేలు ఆర్థిక సహాయం వారి కుమారుడు చదువుల కోసం ట్రస్టు ద్వారా ఇవ్వడం జరిగింది ఈకార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ట్రస్టు కార్యదర్శి రామయ్యనాయుడు,ట్రస్టు సభ్యులు బాపు, తదితరులు పాల్గొన్నారు.

### నేదురుమల్లిని కలిసిన వైసీపీ నేత గెడి శ్రీనివాసులురెడ్డి

ఓజిలి, నవంబర్ 24 ప్రభాతవార్త



తిరుపతి పార్లమెంటు జిల్లా వైసీపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఐటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడి శ్రీనివాసులురెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేదురుమల్లిని కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

### మానమాల బాబా గుడిలో అన్నదానం

ఓజిలి, నవంబర్ 24 ప్రభాతవార్త



ఓజిలి మండలం మానమాల గ్రామంలోని సాయి బాబా గుడిలో కురుగొండ సొసైటీ అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి, వైసీపీ సీనియర్ నాయకులు ఉచ్చూరు హరిరెడ్డిల ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా గుడిలో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం ఉండాలని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు డిమాండ్

పాలసముద్రం, నవంబర్ 24 ప్రభాతవార్త:
పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలోని సమస్యలపై ఆన్‌లైన్‌లో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు చేసిన వారిపై పంచాయతీ కార్యదర్శి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, గ్రామ సచివాలయంలోని సిబ్బందితో తిట్ల పురాణం చేపడుతున్నారనిఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఇంటి పట్టాలకు స్థలం గుర్తింపు

- కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:
పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో అర్హులైన నిరుపేదలకు ఇప్పటికీ ఇంటి పట్టాలు పంపిణీ చేయని పరిస్థితి నెలకొందని సత్వరం ఇళ్ళ నిర్మాణాల కోసం స్థలం గుర్తించి అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కలెక్టర్ హరినారాయణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

### డాక్టర్ల సూచన మేరకు యాంటీబయోటిక్స్ వినియోగం

చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త:




అర్హత కల్గిన డాక్టర్ల సూచన మేరకు యాంటీబ యోటిక్స్ వినియోగించాలని జిల్లా సర్వెలెన్స్ అధికారి డాక్టర్ సుదర్శన్ అన్నారు. చిత్తూరులో గురువారం యాంటీబయోటిక్స్ మీద అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాంటీబయోటిక్స్ అధికమోతాదులోవినిగిస్తే ఆరోగ్యా నికి హానికరమని వైద్య అధికారుల సూచనల మేరకు వీటిని ఉపయోగించి ఆరోగ్యంను సంరక్షించుకోవా లన్నారు.జిల్లావ్యాప్తంగాగతవారం రోజులుగా ఈ అవగాహనచేపట్టి పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.

# తెదేపాకు అండగా నిలవండి-మేము మీకు అండగా ఉంటాం


శ్రీకాళహస్తి, నవంబర్ 24 ప్రభాతవార్త

తెలుదేశంపార్టీకి అండగా నిలవండి..మేము మీకు అండగా ఉంటామని తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ పిలుపునిచ్చారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకులుతో సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా నారాలోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ హయాంలో ఏర్పాటు చేసిన కార్పొషన్‌లు ద్వారా ప్రతి ఒక్కరికి రూ.2లక్షలు రుణాలు మంజూరు చేశామని, అయితే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కేవలం పేరుకే కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వాటికి ఛైర్మన్‌లను నియమించినా వారు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు బడుగు, బలహీన వర్గాలకు నాయిబ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు రాజకీయంగాఎదగడానికి ఎన్న అవకాశాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నపుడు చేతివృత్తిదారులకు సంక్షేమ పథకాలును అందజేసిన ఘనత ఒక్క తెలుగుదేశంపార్టీకే దక్కుతుందన్నారు. తాము ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేస్తే నాయిబ్రాహ్మణులు వారి వద్దకు వచ్చే వారికి తెలుగుదేశంపార్టీ చేసిన అభివృద్ధి గురించి వివరించాలని నారాలోకేష్ కోరారు. కాగా సమావేశానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని శ్రీకాళహస్తి నుంచి జిల్లా నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోట.చంద్రశేఖర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం నారాలోకేష్‌ను దుశ్శాలువతో సత్కరించి, శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు.

## వర్షపు నీటిని తొలగింపుకు మున్సిపాలిటి చర్యలు

కమిషనర్ చొరవ



శ్రీకాళహస్తి,నవంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని ఎస్‌డికె నగర్‌లోని పలు ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించుటకు కమిషనర్ బి.బాలాజి నాయక్ చొరవ చూపారు. రెండు రోజుల ముసారతో ఎస్‌డికె నగర్‌లోని తూర్పు ప్రాంతంలో వర్షపు నీరు నిండింది, గతంలో అయ్యలనాడుచెరువు నిండిన తరువాత నీరు ఎస్‌డికె నగర్‌ను చుట్టుముట్టేది. దాంతో ఈ ప్రాంతం ఓ ద్వీపంగా మారేది, శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవతో ప్రస్తుత కమిషనర్ బి.బాలాజి నాయక్ చొరవ చూపారు. సుమారు అయ్యలనాడుచెరువు నీటిని మళ్ళించుటకు రూ.2కోట్లతో రెండు మార్గాల్లో రెండు కాలువలు నిర్మించారు. అయితే ఎస్‌డికె నగర్ లో టెన్నిస్ కోర్టు సమీపంలోని బైపాస్ వరకు కాలువ నిర్మించారు.అయితే చివరన తొట్టంబేడు మండలం సరిహద్దులు కావటంతో అవుట్‌లెట్ నిర్మించలేక పోయారు.అయితే వర్షాలు కురుస్తున్న సమయంలో కాలువలు ఎత్తుగా నిర్మించారు. దాంతో చెరువు నీళ్ళు కాలువలో పారుతుంది. చివరకు వెళ్ళినపుడు అక్కడ అవుట్‌లెట్ లేకుండా మురుగు చేరిపోయింది. దాంతో నీరు పారటం లేదు. ఇక వర్షపునీరు రోడ్డుకన్నా ఎత్తు కాలువల్లోకి పడిన నీరు చేరటం లేదు. దాంతో రెండు రోజుల పాటు కురిసిన ముసారతో నీరు ఇళ్ళ చుట్టు చేరింది.ఈ సమస్యను గురువారం కమిషనర్ దృష్టికి నివాశస్థులు తెచ్చారు. సమస్యల పరిష్కారంలో చొరవ చూపే కమిషనర్ వెంటనే డిఇఇ వెంకటరమణకు ఆదేశించారు.ఆయన సిబ్బంది జెసిబిలతో వెళ్ళి ఇళ్ళ చుట్టూ చేరిన వర్షపు నీరును తొలగించుటకు కచ్చా డ్రైన్ ఏర్పాటు చేసారు. దాంతో బాదితులు కమిషనర్ బాలాజి నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తే లక్ష్యం ఎంఎల్ఏ బియ్యపు

శ్రీకాళహస్తి,నవంబర్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రజలకు తమకు రాజకీయ బిక్ష పెట్టారు.వారికి బంగారు భవిష్యత్తు కల్పించటమే లక్ష్యంగా ప్రయత్నం చేస్తున్నట్లు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి గురువారం తెలిపారు. ఆయన బెంగుళూరులోని మల్టీనేషన్ కంపెనీలతో సమావేశం అయినట్లు వివరించారు.శ్రీకాళహస్తిలోని నిరుద్యోగుల సమస్యను గురించి తన పరిధిలో సమావేశం సేకరించిన ఆయన వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో అడుగులేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఓ వైపు ఆధ్యాత్మిక నిలయంగానే కాకుండా ఉపాధి కేంద్రంగా మారాలన్నది తన లక్ష్యమన్నారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే తాను నియోజకవర్గంలో వచ్చిన ప్రైవేటు కంపెనీల్లో వేలాది మందికి ఉపాధి కల్పించామన్నారు.ఇంకా పెద్ద కంపెనీలు వస్తున్నాయని వివరించారు. తన నియోజకవర్గంలో యువత ఉపాధి లేకుండా ఉండకూడదన్నది లక్ష్యంగా ఎంఎల్ఏ తెలిపారు.ప్రస్తుతం బెంగుళూరులోని పలు మల్టి కంపెనీలతో చర్చించినట్లు వివరించారు. వారు సుముఖంగా స్పందించారు.త్వరలోనే ఆ కంపెనీలు శ్రీకాళహస్తిలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంఎల్ఏ వివరించారు.కంపెనీలే కాకుండా తాను కూడా స్వతహాగా పలువురికి ఉపాధిగా అవకాశం కల్పించామని శాసనసభ్యుడు వివరించారు.

## శివయ్య సేవలో తెలంగాణ అధికారి

శ్రీకాళహస్తి,నవంబర్ 24 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగాప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి తెలంగాణాకు చెందిన ఇన్‌కంటాక్సు శాఖకు చెందిన ఉన్నతాధికారి సేవలో పాల్గొన్నారు.గురువారం జ్యూడిషియల్ మెంబర్ నరసింహాచారి కుటుంబ సభ్యులతో వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో ఎపిఆర్ఓ శ్రీనాధ్ ఏర్పాటు చేసారు.వారు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.దర్శనానంతరం వారికిఆలయ మర్యాదలతో గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## వక్స్‌బోర్డు చైర్మన్‌కు సత్కారం

.తొట్టంబేడు, నవంబర్ 24 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా వక్స్‌బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన షేక్.ఎ ి రాజ్‌బాషాకు మండలం లోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైకాపా యువత మైనార్టీ నాయకులు షేక్‌షబ్బీర్‌బాషా, అబ్బు, ఫజల్, షమీర్, చోటు తదితరులు సిరాజ్‌బాషాను పూలమాల, దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. మైనార్టీలకు అండగా ఉండాలని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన మైనార్టీలకు అందించాలని పలువురు యువత సిరాజ్‌బాషాను కోరారు.

## ఐసిడిఎస్ ప్రాజెక్టును తరలించడం తగదు

తొట్టంబేడు, నవంబర్ 24 ప్రభాతవార్త

తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టును ఇక్కడే కొనసాగించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రాపూరుసుబ్రమణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణానికి సమీపంలోని అతిసమీపంలోని తొట్టంబేడు ప్రాజెక్టు పరిధిలో తొట్టంబేడు మండలం, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కెవిబిపురం మండలాలు ఉన్నాయి. ఈ మండలాలను జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తొట్టంబేడు ప్రాజెక్టును రద్దుచేసి పిచ్చాటూరుకు సూళ్ళూరుపేటకు మార్చడం వల్ల శ్రామిక మహిళలుగా ఉన్నటువంటి అంగన్‌వాడీ మహిళలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వ భవనాలు పక్కాగా ఉన్నాయన్నారు. శాసనసభ్యులు స్పందించి తొట్టంబేడు ప్రాజెక్టు పరిధిలోని మండలాలను ఇతర నియోజకవర్గంలో విలీనం చేయకుండా ఉండాలని డిమాండ్ చేశారు. కాగా తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టును చీల్చి విలీనం చేయడం సబబుకాదని సిఐటియు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## టిడిపిలోనే దళితులకు సామాజిక న్యాయం

తిరుపతి,నవంబర్ 24ప్రభాతవార్త:

బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం, ఈ వర్గాలు రాజకీయంగా ఎదుగుదలకు తెలుగుదేశంపార్టీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు తెలిపారు. గత మూడున్నరేళ్ళ వైసిపి ప్రభుత్వంలో దళితులు దగా పడ్డారని, సంక్షేమ పథకాలు, నిధులు పక్కదారిపట్టాయని ఆరోపించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం దళిత సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చిందని ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో దళితులు ఎలా దగాపడ్డారనే విషయంపై రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి నిర్వహిస్తున్నట్లు రాజు తెలిపారు. తిరుపతినగరంనుంచే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గురువారం సాయంత్రం తిరుపతిలో టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, డాక్టర్ బిఎల్ సంజయ్, డాక్టర్ సప్తగిరి ప్రసాద్, బుల్లెట్‌రమణ, ఊకా విజయకుమార్, శ్రీధర్‌వర్మ,జయకుమార్, జగన్నాధం, హేమంత్‌రాయల్, ఎస్సీ సెల్ విభాగం నాయకులు భారీగా ర్యాలీ ఎన్టీఆర్ విగ్రహం కూడలినుంచి నగరవీధుల్లో సాగుతూ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఇక్కడ అంబేద్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు.

## సత్యవేడు టిడిపి ఇన్‌చార్జీగా హేమలత నియామకంపై హర్షం

నారాయణవనం, నవంబర్ 24 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలతను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చమనాయుడు గురువారం ప్రకటించడం పట్ల నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్త పరిచారు. ఇది వరకే ఆమె 2009-2014 వరకు సత్యవేడు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యేగా పని చేశారు. అలాగే 2004లో సత్యవేడు ఎంపిపిగా పని చేశారు. ఆమె నియామకం పట్ల సత్యవేడు, వరదయ్యపాలెం, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు. కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన నేతలు హర్షం ప్రకటించి ఆమెను అభినందించారు.

## తొట్టంబేడు అంగన్‌వాడీ ప్రాజెక్టును కొనసాగించండి

– సీఐటీయూ డిమాండ్



కేవీబీ పురం, నవంబరు 24 ప్రభాతవార్త:

తొట్టంబేడు ఐసీడీఎస్ ప్రాజెక్టును కొనసాగించాలని సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో సుమారు 20 మంది అంగన్‌వాడీ వర్కర్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తొట్టంబేడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జిల్లా అధికారులు విచక్షణారహితంగా తొట్టంబేడు ఐసీడీఎస్ ప్రాజెక్టును చీల్చి బుచ్చినాయుడు కండ్రిగ మండలాన్ని సూళ్లూరుపేట ప్రాజెక్టులో, తొట్టంబేడు, కేవీబీ పురం మండలాన్ని పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో విలీనం చేశారని ఆందోళన వెలుబుచ్చారు. పిచ్చాటూరు ప్రాజెక్టులో కలపడం వలన పరిపాలన పరిపాలనాపరమైన ఇబ్బందులే కాకుండా వర్కర్స్‌కు హెల్పర్స్‌కు ఆఫీస్‌కు చేరుకోవాలంటే సుమారు 70 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తోందని తెలియజేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తొట్టంబేడులో నూతనంగా నిర్మించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోనే బుచ్చినాయుడు కండ్రిగ, తొట్టంబేడు,కేవీబీ పురం మండలాలతో కూడిన ఐసీడీఎస్ ప్రాజెక్టును కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## మండలంలో ముమ్మరంగా వరినాట్లు

కేవీబీ పురం, నవంబరు 24 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలంలో వర్షాలు పడడంతో ముమ్మరంగా వరినాట్లు ఇటీవల బైరాజ్‌కండ్రిగ, కోవనూరు, రాగిగుంట, వేమలపూడి, కొండల ఆధవరం, ఎస్‌ఎల్ పురం, కళత్తూరు కండ్రిగ, రంగయ్యగుంట, ఆరే తదితర గ్రామాల్లో రైతులు సిద్ధపడుతున్నారు. సంబంధిత రైతాంగం దుక్కులు దున్నుకుని వరినాట్లకు వరి పంటలకు వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు. వ్యవసాయ అధికారులు మండల కేంద్రంలో డెమోనిస్ట్రేషన్ క్లాసెస్ పెరిడితే వాటిపైన తగు సూచన అందిస్తారని పలువురు రైతాంగం ఎదురుచూస్తున్నారు. రైతులకు తన శుద్ధి ఎరువుల వాడకాలు క్రిమిసంహారక మందులు తదితర వ్యవసాయ అభివృద్ధికి పలు సూచనలు, సందేశాలు అందించేందుకు వ్యవసాయశాఖ అధికారుల బృందం పర్యటించాల్సిన బాధ్యత ఉందని పలువరు కోరుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి కేవీబీ పురం మండల కేంద్రంలో దానికి సంబంధించినటువంటి నిర్మాణ క్లాసెస్ కేంద్రాల ద్వారా అందించాల్సిన బాధ్యత ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## పాడి రైతులకు విరివిగా బ్యాంకు రుణాలు

పుత్తూరురూరల్, నవంబరు 24 ప్రభాతవార్త:



పాల వెల్లువ పథకంలోని లబ్ధిదారులకు విరివిగా బ్యాంకు రుణాలు అందించనున్నట్లు ఏపీఎం డి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం పుత్తూరు మండలంలోని గోపాలకృష్ణాపురం సచివాలయంలో జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు రుణాల కోసం డాక్యుమెంటేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటి వ్యాపారులకు పాలు పోసి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పాలు పోయాలన్నారు. ప్రైవేటు కంటే గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో బిల్లులు అందుతాయని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేలాయుధం, కో-ఆప్షన్ సభ్యులు రాయ, ఎంపీటీసీ కాంతమ్మ, వెలుగు సీసీ గోపినాథ్‌రెడ్డి, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన వాహనాలు వేలం

నగరి, నవంబరు 24 ప్రభాతవార్త :

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం వేలం వేశారు. చిత్తూరు ఇన్‌ఛార్జ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేల నిర్వహించారు. 20 ద్విచక్ర వాహనాలను వేలం వేయగా 14 వాహనాలను పాటదారులు కొనుక్కున్నారు. జిఎస్టీతో కలిపి ఈవాహనాలకురూ.3.71లక్షలు వసూలైంది. వేలం పాటలో సిఐ శ్రీనివాసంతి, ఎఎస్ఐ రవి పాల్గొన్నారు.

## కుమారస్వామి కొండను సర్వే చేయండి

: ఆలయ పవిత్రతను కాపాడండి: ఆర్‌డిఓకు చైర్మెన్ వినతి



శ్రీకాళహస్తి, నవంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టణంలో కోట్లు విలువ చేసే భూములున్నాయి.అయితే అన్ని అన్యాక్రాంత మయ్యాయి. ముఖ్యంగా కుమారస్వామి కొండ దిగువన ఉన్న వినాయక మండపం పునర్నిర్మాణం చేపట్టామని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆర్‌డిఓకు విన్నవించారు. గురువారం చైర్మెన్ ఆర్‌డిఓ రామారావును కలసి దేవస్థానం ఆస్తుల పరిరక్షణకు సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ప్రస్తుతం కుమారస్వామి కొండ దిగువన మండపం తొలగించి కొత్త మండపం నిర్మిస్తున్నామని అయితే మండపం కొండపైన కుమారస్వామి ఆలయానికిమధ్యలో నిర్మాణాలు జరిగినాయని వివరించారు దాంతో అక్కడ మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు.ఇది ఆలయ పవిత్రను దెబ్బతీసే విధంగా ఉందని ఆర్‌డిఓకు ఫిర్యాదు చేసారు.పలు చోట్ల మండపాలు ఆలయాలు శిధిలమైన ఆలయాల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నట్లు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆర్‌డిఓకు వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో దేవస్థానం ఆస్తులు పరాధీనమయ్యాయి. అంతేకాక కొట్ల విలువ చేసే శివయ్యఆస్తులు కోర్టు వివాదాల్లోఉన్నాయని ఆర్‌డిఓకు ఫిర్యాదు చేసారు.ఒక సారి దేవస్థానం భూములకు సంబందించి రీ సర్వే జరపాలని ఆయన ఆర్‌డిఓను కోరారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరునికి రాజులు పట్టణంలోనూ కైలాసగిరుల్లో సుమారు 24వేల ఎకరాలు కేటాయించినట్లు గత రికార్డుల్లో ఉంది. అయితే 1994లో దేవస్థానం భూములకు సంబంధించి శాసనసభలో వచ్చిన ప్రశ్నకు రెవెన్యూ అధికారులు సమాదానం చెబుతూ 5400 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారని వివరించారు. కానీ అంత భూమి లేదన్నారు. రీ సర్వే జరిపి దేవస్థానంకు రికార్డు ప్రకారం ఎంత భూమి ఉందో రాతమూలకంగా ఇవ్వాలని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు.

**ఆర్‌డిఓ స్పందన:**శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాతమూలక అభ్యర్థన మేరకు ఆర్‌డిఓ రామారావు శ్రీకాళహస్తి తహశీల్దార్ జరీనాకు ఆదేశాలు జారి చేస్తూ వెంటనే సర్వేయర్‌తో కలసి కుమారస్వామి తిప్ప పరిసరాలను సర్వే జరిపి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.

# తిరుపతి డివిజన్

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్పించండి

-డిప్యూటీ సిఎంకు లోకనాథరెడ్డి విజ్ఞప్తి

వెదురుకుప్పం,నవంబర్ 24 ప్రభాతవార్త:

వెదురుకుప్పం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని సొసైటీ మండల అధ్యక్షుడు లోకనాథరెడ్డి మరియు స్థానిక నాయకులు డిప్యూటీ సిఎం నారాయణస్వామి దృష్టికి తెచ్చారు.గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ విషయాన్ని డిప్యూటీ సిఎంకు విజ్ఞప్తి చేశారు.దీనికి వెంటనే స్పందించిన డిప్యూటీ సిఎం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి వెదురుకుప్పం సొసైటీ ఆవరణలో గల ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి,తక్షణం అక్కడి నుండి వేరే చోటికి మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌సి కృష్ణారెడ్డి,డిఇ రెడ్డెప్ప,ఎఇ రామాంజనేయులు,మండల వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెటర్నరీ అసిస్టెంట్ కావేరి సేవలు అభినందనీయం

-జడ్పీటిసి చల్లపాళ్యం సుకుమార్

వెదురుకుప్పం,నవంబర్ 24 ప్రభాతవార్త:

మండలంలోని మాంబేడు సచివాలయం పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ కావేరి పాడి రైతులకు చేసిన సేవలు అభినందనీయమని జడ్పీటిసి చల్లపాళ్యం సుకుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గుణశేఖర్,డిడిఓ సుబ్రహ్మణ్యం,కార్యదర్శి నాగరాజు,విఆర్ఓ కృష్ణయ్య,ఉపాధ్యాయుడు దేశాయ్,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొని కావేరిని ఘనంగా సన్మానించారు.

## పిసిసి అధ్యక్షుడిగా రుద్రరాజు నియామకం శుభపరిణామం

-పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేస్తాం -హర్షం వ్యక్తం చేసిన పోటుగారి భాస్కర్

వెదురుకుప్పం,నవంబర్ 24 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా సీనియర్ నేత గిడుగు రుద్రరాజు నియామకం కావడం శుభపరిణామమని కాంగ్రెస్ నేత పోటుగారి భాస్కర్ హర్షం వ్యక్తంచేశారు.గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గిడుగు రుద్రరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిత్యం పోరాడుతోందని,2024లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రుద్రరాజు నాయకత్వంలో తామంతా సైనికులవలె పనిచేస్తామని స్పష్టం చేశారు.హర్షం వ్యక్తం చేసిన వారిలో డిసిసి కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి,ఓబిసి నాయకుడు సుబ్బరాయులు,ఓబిసి మాజీ ఉపాధ్యక్షుడు బుల్లెట్ రవి,డిసిసి ఉపాధ్యక్షుడు డి.కణ్ణన్,వెదురకుప్పం మండల అధ్యక్షుడు కందుకూరి హుమేష్,జిడి.నెల్లూరు మండల అధ్యక్షుడు నరసింహులునాయుడు,కార్వేటినగరం మండల అధ్యక్షుడు దినకర్‌ప్రసాద్,పాలసముద్రం మండల అధ్యక్షుడు పుష్పరాజ్,నాయకులు దాసురెడ్డి,జయచంద్ర,వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## లోకా పౌండేషన్ వారి ఆద్వర్యంలో గోవర్ధనపురంకు త్రాగునీరు సదుపాయం

వరదయ్యపాలెం, నవంబర్,24,( ప్రభాతవార్త)




తిరుపతి జిల్లా వరదయ్యపాలెం, పంచాయతీ అధికారుల విన్నపం మేరకు గోవర్ధనపురం వాసులకు కురుస్తున్న వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి కరెంట్ లేనందువలన త్రాగునీటి సదుపాయంకి అంతరాయం కలగడంతో ప్రజలు త్రాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం తెలుసుకున్న లోకా పౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీగారు చొరవ తీసుకొని నీటి ట్యాంకును తెప్పించి త్రాగునీటి సమస్యను తీర్చడం జరిగింది.
ఈ సమస్య తెలుసుకొని సకాలంలో స్పందించిన లోకా పౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీగారికి గోవర్ధనపురం గ్రామవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## సబ్సీడి వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయండి : జడ్పీటీసీ

నారాయణవనం, నవంబర్ 24 ప్రభాతవార్త :



మండలంలోని రైతులందరికి రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను అందించాలని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సకాలంలో వేరుశెనగ విత్తనాలను అందించడం వల్ల పంట పండించుకోవడానికి ఉపయోగకరంగా వుంటుందన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకొని రైతులకు 30 కిలోల వేరుశెనగ బస్తాను వాస్తవానికి 2575 రూపాయాలకు అందించడం జరుగుతుందని, అయితే సబ్సిడి క్రింద 1545 రూపాయాలకు అందించడం జరుగుతుందన్నారు. రైతులు రైతుభరోసాకేంద్రాలకు వెళ్లి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుణశేఖర్, ఎఒ శోభారాణీ, డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్పు, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయలు, సర్పంచ్‌లు మురుగేశం, అయ్యప్పశశికళ, గుణశేఖర్, ధర్మలింగం, సుబ్రమణ్యంరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యవేడు టిడిపి ఇన్‌చార్జ్‌గా హేమలత

సత్యవేడు,నవంబర్ 24 ప్రభాతవార్త :



గత రెండేళ్ళుగా సత్యవేడు టిడిపిలో నెలకొన్న అనుమానాలను అధిష్టానం గురువారం ప్రకటనతో తేటతెల్లం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి తరుపున జె.డి.రాజశేఖర్ పోటీ చేసి మాజీ ఎమ్మెల్యే హేమలత ఓటమి చెందారు. అప్పటి నుంచి సత్యవేడు టిడిపి ఇన్‌చార్జ్ వ్యవహారం నువ్వా..నేనా అంటూ ఇటు జె.డి.రాజశేఖర్ అటు మాజీ ఎమ్మెల్యే హేమలత మధ్య పోరు కొనసాగుతూ వచ్చింది. నేనంటే నేనేనంటూ ఇరువురు నియోజకవర్గంలో పోటీలు పడుతూ వివిధ ఆందోళన కార్యక్రమాలను ప్రభుత్వ వ్యతిరేకంగా చేపడుతూ వచ్చారు.చివరకు ఇన్‌చార్జ్ వ్యవహారాన్ని అధిష్టానం తేల్చేసింది. మాజీ ఎమ్మెల్యే హేమలత ఇకనుంచిసత్యవేడుటిడిపినియోజకవర్గఇన్‌చార్జ్‌గా కొనసాగుతారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెమనాయుడు లిఖితపూర్వక ఆదేశాలు గురువారం విడుదల చేశారు. హేమలత మీడియాతో మాట్లాడుతూ పార్టీలోని అందరినీ కలుపుకుని ఒకే తాటిపై వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. హేమలత నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## సత్యవేడు మండలంలో "బెల్ట్" జోరు

సత్యవేడు, నవంబర్ 24, ప్రభాతవార్త :

పర్యవేక్షణ లోపం...పట్టించుకునే దిక్కులేకపోవడంతో మండలంలో కొన్ని చోట్ల మద్యం బెల్టు షాపులు పట్టుకొస్తున్నాయి. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రానికి సుమారు 4 కి.మీ సమీపంలోని మదనంబేడులో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాలుగు మద్యం బెల్టు దుకాణాలు జోరుగా సాగుతోంది. సత్యవేడు నుంచి మద్యాన్ని తీసుకు వచ్చి బాటిల్‌పై రూపాయలు 25 నుంచి 30లు అధికంగా పెట్టి మద్యం ప్రియులకు మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇదే పరిస్థితి ఆంబాకం, సీతారామపేట, జడేరి, ఓబులురాజుకండ్రిగ, చమర్తికండ్రిగ గ్రామాల్లో కూడా మద్యం బెల్టు దుకాణాలు మూడు క్వాటర్లు, ఆరు పుల్ బాటిల్ చొప్పున నడుస్తున్నా కట్టడి చేసే దిక్కులేదని ఆయా ప్రాంతాల గ్రామస్తులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఊరూర..మద్యం షాపులు అందుబాటులోకి వచ్చి ప్రజల ఆరోగ్యాలకు హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పాతభవనం కూల్చివేతను పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 24, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ పాత భవనం కూల్చివేతను గురువారంకమిషనర్‌అనుపమఅంజలిపరిశీలించారు. కమిషనర్‌అనుపమఅంజలి కూల్చివేతను దగ్గరుండి పరిశీలించి త్వరగాపూర్తిచేయాలని ఆదేశించారు. మేయర్ శిరిషాతో పాటు స్మార్ట్ సిటీజిఎంచంద్రమౌళి,డిఈ దేవిక తదితరులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ

రేణిగుంట, నవంబరు 24 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు జి.వెంకటనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో ప్రకృతి వ్యవసాయ విధానం ప్రాముఖ్యత గురించి వివరిస్తూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు వాడడం వలన భూమిలోని సూక్ష్మజీవులు నశించి సారవంతమైన భూమి నిర్జీవంగా మారుతున్నదని తద్వారా భవిష్య తరాలకు ఎదురయ్యే సమస్యల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పండించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర ఉంటుందని ఇందు కోసం అవసరమైన ఆర్గానిక్ సర్టిఫికేషన్ విధానం గురించి రైతులకు తెలిపారు. ముఖ్య అతిథి శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు వెంకటనాయుడు మాట్లాడుతూ హరిత విప్లవ ఆవిర్భావం, పరిణామాల గురించి వివరిస్తూ తక్కువ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి అధిక దిగుబడినిచ్చే రకాల సాగు చేపట్టాలని, ప్రకృతి వ్యవసాయ విధానంలో దేశివాలీ పాడి జాతుల ప్రాముఖ్యత, రసాయన ఎరువుల వాడకం ద్వారా పండిన ఆహార పదార్థాలు తినడం ద్వారా జరిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డా. జి.వెంకటనాయుడు, గ్రామీణ వికాస సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎల్. సూర్య నారాయణరెడ్డి, ప్రకృతి వ్యవసాయ రైతు, భవానీ బయో అగ్రో ఫార్మ్ వ్యవస్థాపకులు ఎస్.రాజేంద్రనాథ్‌రెడ్డి, వెంచురా అగ్రిటెక్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి పెంచల కుమార్, ప్రకృతి వ్యవసాయ రైతు దామా అయ్యప్పనాయుడు, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త హెడ్. డా. ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు సుధాకర్, దివ్య, శ్రీలత, పద్మజ, రాముకుమార్, కేవీకే సిబ్బంది, వడమాలపేట, రేణిగుంట, తిరుపతి రూరల్ మండలాల నుంచి 40 మంది రైతులు పాల్గొన్నారు.

# ఇండియాస్ మ్యాక్రో ఎకనామిక్ ఇష్యూస్, చాలెంజెస్ పై సెమినార్

తిరుపతి విద్య, నవంబర్ 24, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం విభాగంలో ఈ నెల 24,25వ తేది రెండు రోజుల నేషనల్ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సెమినార్ కోఆర్డినేటర్ డా. పి. మాధవి పేర్కొన్నారు. గురువారం ఇండియాస్ మ్యాక్రో ఎకనామిక్‌ఇష్యూస్, ఛాలెంజెస్ అనే అంశం పై సెమినార్ నిర్వహించారు. రీడర్ డా. డి. ఉమాదేవి మహిళా అధ్యయన కేంద్రం, విభాగం అతిధులకు స్వాగతంపలికారు. ప్రొఫెసర్ కె. అనురాధ డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్అండ్‌మేనేజ్మెంట్ ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ రొక్కం సుదర్శన రావు, ఫార్మర్ వైస్ చాన్సలర్ విక్రమ సింహాపురి యూనివర్సిటీ నెల్లూరు ఫార్మర్ నెంబర్ ఫోర్త్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కి నాట్‌కి నోట్ స్పీకర్‌గా ఉండటం జరిగింది. డాక్టర్ పి. మాధవి సెమినార్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశం ఆర్థికంగా ఇంకా చాలా అభివృద్ధి చెందాలని కీనోట్ స్పీకర్ వివరిం చారు. ఉద్యోగాలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ పి. నీరజ ఇన్చార్జ్ హెడ్‌మహిళా అధ్యయన కేంద్రం, విభాగం కోఆర్డినేటర్ డా. ఎం. పద్మావతి వ్యవహరించారు. ఈప్రారంభోత్సవ వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు ఉపాధ్యాయులు రీసర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పేపర్లు ప్రజెంట్ చేయడానికి దేశం నుంచి వివిధ విశ్వవిద్యాలయాల నుంచి విచ్చేసారు.



## ప్రాణదాన పథకంలో 148మంది పేదరోగుల ఎంపిక



తిరుపతినగరం, నవంబరు 24, (ప్రభాతవార్త): శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలో గురువారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ అధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 148 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రాణదాన కమిటీ సభ్యులను మాట్లాడుతూ రోగుల ఆరోగ్య స్థితిగతులను, బియ్యంకార్డు కలిగిన దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను వారి అర్హతలను బట్టి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రాణదాన పథకం క్రింది ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి వివిధ విభాగాల క్రింద ఎంపిక చేశామన్నారు. రోగులను వారికి వున్న వ్యాధులలో కార్డియో థోరాసిక్ 10, కార్డియాలజీ 6, ఐ.ఎస్.టి 1, జనరల్ సర్జరీ 5, మెడికల్ అంకాలజీ 2, మెడిసిన్ 12, న్యూరోసర్జరీ 15, నెఫ్రాలజీ 24, న్యూరాలజీ 27, గైనకాలజీ 4, రేడియేషన్ అంకాలజీ 17, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ 7, సర్జికల్ అంకాలజీ 15, యూరాలజీ 3తో కలిపి మొత్తం 148 మంది రోగులున్నారన్నారు. పేద రోగులకు ప్రాణదాన పథకం కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి ఆర్థిక సహాయం చేస్తున్న టిటిడి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, డాక్టర్లు రామ్, కె.వి.కోటిరెడ్డి, కిషోర్ కుమార్, ఇ.బి.దేవి, పి.రాధారాణి పాల్గొన్నారు.

## మండల మీట్‌లో ప్రోటోకాల్ రచ్చ!

**- భార్యల స్థానంలో వేదిక ఎక్కిన భర్తలు...తెదేపా సభ్యుల ఆందోళన**
**-జెడ్పీటిసి సుష్మాశ్రీరెడ్డి లేక ఆమె భర్తనా అని తెదేపా ఎంపిటిసి,సర్పంచులు ప్రశ్నలు ..!**



పెద్దపంజాణి నవంబర్ 24 ప్రభాతవార్త : ప్రతి మూడునెలలకు ఒకసారి మండలస్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారవేదికగా నిలిచే మండల సర్వసభ్య సమావేశం ప్రోటోకాల్ వ్యవహారంతో రచ్చరచ్చగా సాగింది. మహిళా ప్రజాప్రతినిధుల స్థానాల్లో వారిభర్తలు వేదికెక్కి ఆశీనులు కావడంలో ప్రతిపక్ష సభ్యులకు ఆగ్రహం వచ్చింది.భార్యల స్థానంలో భర్తల పెత్తనం ఏంటని సమావేశపు హాల్లో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి నచ్చచెప్పడంతో అనంతరం సమావేశం నిర్వహించారు. పెద్దపంజాణి మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఎన్.రెడ్డెప్ప అధ్యక్షతన ప్రారంభ మైంది ఇంతలోనే జెడ్పీటిసి సభ్యురాలు సుష్మాశ్రీ భర్త బాగారెడ్డి,మండల వైకాపా కన్వీనర్ హోదాలో వేదికపై కూర్చున్నారు.దీంతో ఒక్కసారిగా ప్రతిపక్ష తెలుగు దేశంపార్టీ ఎంపిటిసిలు,సర్పంచులు మండల సమావేశంలో ప్రోటోకాల్ పాటించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు.మండల కన్వీనర్ సమావేశానికి వచ్చి వేదిక ఎక్కడం మంచిదికాదని పేర్కొన్నారు. బాగారెడ్డితో మిగతా మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వచ్చిన వారి భర్తలను,కుటుంబ సభ్యులను బయటికి పంపిన అనంతరం సమావేశం ప్రారంభించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. అయితే అధికార పార్టీనేతలు దీన్ని పట్టించుకోకపోగా ప్రతిపక్ష సభ్యులు సమావేశపు హాలులోనే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సమయంలో ఇరుపార్టీల సభ్యుల మధ్య వాగ్వివాదాలు మొదలై పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది.తెదేపా సభ్యులు మండల కన్వీనర్‌ను బయటకు పంపించాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు.

**మండలంలో పెత్తనం ఆయనదేనా తెదేపా సభ్యులు.**

మండలంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మాశ్రీ భర్త అయిన మండలకన్వీనర్ బాగారెడ్డికే ఆజమాయిషీ అంతా జరుగుతోందని ప్రతిప్రోటోకాల్ విషయాన్ని ఆయన కనుసన్నల్లోనే నిర్వహిస్తున్నారని టిడిపి ఎంపిటిసి, సర్పంచులు విమర్శించారు. ఆఖరికి మండల సర్వసభ్య సమావేశంలో కూడా ఆయన అజమా యిషీ వుంటే ఏమిటా సభని ప్రశ్నించారు.గతంలోనూ పలుమార్లు మండల సర్వసభ్య సమావేశం లోనూ పాల్గొనడానికి ప్రయత్నించినప్పుడు అధికారులునచ్చచెప్పడంతో ఆయన వెనుతిరిగారని అయితే ప్రస్తుతం అధికారులు కూడా బెఖాతరుచేసి సమావేశానికి రావడం ఎంత మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు.ఇదే సమావేశాలకు తమ స్థానంలో తాము ఇతరులను పంపితే వైకాపా ప్రజా ప్రతినిధులు అంగీకరిస్తారా అంటూ ప్రశ్నించారు.అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు పార్టీ నేతలకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమనిగింది.అనంతరం మండలంలో ఉన్న సమస్యలపై సభ్యులు అధికారులు చర్చించారు.మండలంలో చేస్తున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. కాగా మండల కన్వీనర్ బాగారెడ్డి సమావేశం ముగిసేదాకా అక్కడే వుండటం గమనార్హం. సమావేశంలో ఎంపిడిఓ భాస్కర్,తహశీల్దార్ హనుమంతు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా విధులు

**- ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం**
**- చట్టంపై గౌరవం పెరిగేలా కర్తవ్య నిర్వహణ**
**- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి**



చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త: విజిబుల్ పోలీసింగ్ పెరిగేలా విధులు నిర్వర్తించి పోలీసు అధికారులు ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరిం చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల పోలీసులు మర్యాదగా వ్యవహరించి మన ప్రవర్తన ఆదర్శనీయంగా వుండేలా చూడాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ విషయంలో పోలీసులు గట్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల అదుపుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో పెండింగ్‌లో వున్న నాన్ బెయిల్ వారెంట్ల జారీలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలన్నారు. ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా, నాటుసారాపై ఉక్కుపాదం మోపాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. లోన్ యాప్‌ల ఉచ్చులో ప్రజలు పడకుండా వారికి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రక్క రాష్ట్రాల నుండి అక్రమ మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నాటు సారా తయారీ స్థావరాలపై ఎన్ఫోర్స్ మెంట్ బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహించి మూలాలను పెకలించే ప్రయత్నం చేయాలన్నారు. అలాగే నిఘా, సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేసి వాహనాల తనిఖీని ఉధృతం చేయాలన్నారు. అలాగే జిల్లాలో ఎక్కువగా ఎర్రచందనం, నాటుసారా, అక్రమ మద్యం కేసులు వున్న వారిపై పిడి యాక్ట్ ప్రయోగంకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ స్థాయి నుండి నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన జెవి శ్రీనివాసరావును ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్‌లు సన్మానించారు. ఈ సమావేశంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, డిఎస్పీలు శ్రీనివాసమూర్తి, సుధాకర్‌రెడ్డిలు, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ శరత్‌చంద్ర, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మోహినీ అలంకారంలో పల్లకిలో అలమేలుమంగ



తిరుచానూరు,నవంబర్ 24 (ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం ఉదయం అమ్మ అలమేలుమంగ మోహినీ అలంకారంలో పల్లకిలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఇందులో భాగంగా గజవాహనం సందర్భంగా లక్ష్మీ కాసుల హారాన్ని తిరుమల శ్రీవారి ఆలయం నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో టిటిడి ఈఓ ధర్మారెడ్డి దంపతులు,చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, విఎస్ఓ మనోహర్,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,ఏవిఎస్ఓ శైలేంద్రబాబు,ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాము, తదితరులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుచానూరు,నవంబర్ 24 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని గురు వారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుమ్మల గుంట నుండి తిరుచానూరుకు పాదయాత్రగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిం చారు. ఆలయం వద్దకు చేరుకున్న చెవిరెడ్డి దంపతులకు తిరుచానూరు సర్పంచ్ రామ చంద్రారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి గత కొన్నేళ్లుగా అమ్మవారికి కార్తీక బ్రహ్మోత్సవాలలో గజవాహనసేవ రోజున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మహిళలు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, ఆర్ఆర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా వసంతోత్సవం



తిరుచానూరు,నవంబర్ 24 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో గురువారం సాయంత్రం వసంతోత్సవం వేడుకగా జరిగింది.ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం, సాయంత్రం వాహనసేవల్లో పాల్గొని అలసిపోయిన అమ్మవారికి ఉపశమనం కల్పించేందుకు వసంతోత్సవం నిర్వహించారు. వసంతోత్సవంలో భాగంగా చందనంతో పాటు పలు రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి విశేషంగా అభిషేకం చేశారు.అనంతరం చల్లదనం కోసం చందనం జలాన్ని మాడవీధుల్లో భక్తులు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. అధికారులు, అర్చకులు ఉత్సాహంగా భక్తులపై వసంతాలు చల్లారు. అధికారులు,విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప అంబళ పూజ



బంగారుపాళ్యం, నవంబర్ 24 ప్రభాతవార్త: బంగారుపాళ్యంలో ముత్యాలమ్మ గుడి ఆవరణలో అయ్యప్పస్వామికి ఆంబళ్ళపూజను గురువారం అయ్యప్ప స్వామి భక్తులు వైభవంగా నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆంబళాలు ఏర్పాటు చేశారు. ఈ ఆంబళాల నందు అయ్యప్పస్వామి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి, ఇతర దేవతామూర్తుల చిత్రపటాలను వుంచి పూజలు నిర్వహించారు. ఈ ఆంబళ పూజకు ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన కె.గిరిబాబు వ్యవహరించారు. పూజ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పత్రాలను పంపిణీ 15రోజులలో పూర్తి : అజయ్‌కల్లాం

తిరుపతిరూరల్, నవంబర్ 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పత్రాల పంఫిణి కార్యక్రమాన్ని జిల్లాలో 15రోజుల లోపు పూర్తి చేయాలని రీ సర్వే స్టీరింగ్ కమిటీ ఛైర్మెన్ అజయ్ కల్లాం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరేన్స్‌లో ఛైర్మెన్ మాట్లాడుతూ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, కోర్టు కేసులలో పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా డ్రాఫ్టిలో ఆర్.ఓ.ఆర్ 13 నోటిఫికేషన్‌కు సంబంధించిన పనులు నిర్దేశించిన పూర్తి కావాలన్నారు. మ్యుటేషన్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలని, చేయని పక్షంలో సంబంధిత అధికారులపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 69 గ్రామాలకు సంబంధించిన 6047 వైయస్సార్ భూ హక్కు, భూ హక్కు పత్రాల పంఫిణికి సిద్ధం కావాలన్నారు.

## దళితులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేశాయి?

**మాజీ కేంద్ర మంత్రి డా॥చింతా మోహన్ డిమాండ్**




తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 24 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుపేదల పరిస్థితి అతిదారుణ ంగా ఉందని,పేదల ఆత్మహత్యలు ఎక్కువ అవుతున్నాయని, దీంతో ఆంధ్రప్రదేశ్ అనేది ఆత్మహత్యల ప్రదేశ్‌గా మారుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత,మాజీ కేంద్ర మంత్రి డా॥చింతా మోహన్ ఆవేదన వ్యక్తంచేశారు.గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవు.తినేదానికి తిండిలేక,ఉండేదానికి ఇల్లు లేక,ఆకలికి తినడానికి తిండి లేక దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివి గ్రామాల్లో కూలి పనులు చేస్తున్నారని వాపోయారు.అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సంస్థ అయిన టిటిడికి చెందిన స్విమ్స్ ఆసుపత్రిలో పని చేస్తున్న 800కు పైగా ఔట్‌సోర్సింగ్ కార్మికుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉందన్నారు.నెలకు 8 నుండి 10 వేల జీతమిస్తే వారు ఎలా బ్రతకాలన్నారు. రైతులకు భూ హక్కు చట్టం కల్పించింది తమ కాంగ్రెస్ హయాంలోనే నన్నారు. 2024లో బిజెపి,వైసిపిలు ఖచ్చితంగా అధికారంలోకిరావని ఆయన స్పష్టం చేశారు.దేశ ప్రజలు,ఏపి ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి,రవి,పూతలపట్టు ప్రభాకర్,తేజోవతి,శాంతి యాదవ్, రావణ్, శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి గడ్కరి పర్యటనను విజయవంతం చేయండి : జిల్లా కలెక్టర్

తిరుపతిరూరల్, నవంబర్ 24 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి జిల్లాలో ఈనెల 27,28 తేదీలలో పర్యటించనున్నారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లలో జె.సి. డికె బాలాజీ, నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, జిల్లా అధికారులతో కేంద్ర మంత్రి పర్యటనపై సమీక్షించారు. ఈనెల 27న రాత్రి 7:30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుమలలో బస చేస్తారని, 28న ఉదయం శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని, 9.50 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని, 10:30 గంటలకు నెహ్రూ మునిసిపల్ హై స్కూల్ గ్రౌండ్‌లో సుబ్రమణ్యంస్వామి అభిశేక కార్యక్రమంలో పాల్గొని, 11 గంటలకు ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జాతీయ రహదారుల కార్యక్రమ సభలో పాల్గొంటారని తెలిపారు.

## విద్యుత్ బిల్లులను 24 గంటలలో అప్లోడ్ చేయాలి

**- రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి కమీషనర్ కోన శశిధర్**



తిరుపతిరూరల్, నవంబర్ 24 ప్రభాతవార్త: 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి పంచాయతీ విద్యుత్ బిల్లులను 24 గంటల్లో అప్లోడ్ చేయాలని, జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ కోన శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లను, జె.సి.లను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి కమీషనర్ వీడియో కాన్ఫరేన్స్‌లో పాల్గొనగా జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి. డికె.బాలాజీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరేన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమీషనర్ మాట్లాడుతూ స్వమిత్వ (గ్రామ కంఠం సర్వే)కు సంబంధించిన పనులను పకడ్బందీగా వేగవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించటానికి తీసుకువచ్చిన జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు జరిగేలా చూడాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాల షెడ్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నిషేదం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్‌ను వేరుచేసి రోడ్డు నిర్మాణాలకు వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం దిశగా పంచాయతీ తీర్మానాలను ఆర్‌డబ్ల్యుఎస్ ఏస్.ఇ 24గంటల్లో అన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలైన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలను దశల వారీగా పురోగతి ఉండేలా లక్ష్యాలు నిర్ధేశించుకుని వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విజయకుమార్, డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ ఇంజనీరింగ్ అధికారి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి ఇంట అభిమానులు సంబరాలు



వాకాడు, నవంబర్ 24, ప్రభాతవార్త : రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి తిరుపతి జిల్లా అధ్యక్ష పదవి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించడంతో నేదురుమల్లి ఇంట అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం వాకాడులోని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఇంటి వద్ద వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వాకాడు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలుకు స్వీట్లు పంచి, బాణాసంచాలతో సంబరాలు జరుపుకున్నారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేదురుమల్లి వంశోద్దారకుడు రామ్ కుమార్ రెడ్డికి నూతన తిరుపతి జిల్లాకు అధ్యక్షుడిగా వైసిపి ప్రభుత్వం నియమించడంతో మండల పార్టీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రామన్న అడుగుజాడలో ఉంటామని తెలిపారు. త్వరలో వాకాడుకు రానున్న రామన్నకు భారీ స్థాయిలో స్వాగతం పలుకుతామని రాజశేఖర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తపరిచారు. ఈ సంబరాల్లో వైసిపి నాయకులు వాకాడు దేవాలయ సముదాయ కమిటీ ఛైర్మన్ గూడురు వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ దువ్వూరు భార్గవ్ రామ్, నెల్లూరు పెంచల్ రెడ్డి, వాకాడు వార్డు కమిటీ సభ్యులు కిషోర్ కుమార్, వాకాటి రవికుమార్, గూడూరు సుధాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో రామ్‌కుమార్‌రెడ్డికి తిరుపతి జిల్లా అధ్యక్ష పదవి రావడం పట్ల ఆయా నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.

## అర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన డిప్యుటీ సిఎం



పాలసముద్రం, నవంబర్ 24 ప్రభాతవార్త: మండలంలోని వనదుర్గాపురంలో గురువారం డిప్యుటీ సిఎం నారాయణస్వామి వనదుర్గాపురం- బెంగళూరు, వనదుర్గాపురం-చిత్తూరు పల్లెవెలుగు సర్వీసును ప్రారంభించారు. డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఇది వరకు బలిజకండ్రిగ- బెంగళూరు అర్టీసీ బస్సు సర్వీసు నడిచేదని అయితే కొన్ని కారణాలతో అర్టీసీ అధికారులు ఈ సర్వీసును నిలుపుదల చేయడంతో స్థానిక నాయకులు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డితో పాటు తనకు బెంగళూరు సర్వీసును పునఃప్రారంభించాలని కోరడంతో ఈ మేరకు చర్యలు తీసుకొన్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య వున్న స్థానిక నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, వాలంటీర్లు ప్రజలకు నిరంతరం అందుబాటులో వుండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపిపి శ్యామల మాట్లాడు తూ వనదుర్గాపురంకు అర్టీసీ సర్వీసు నడపాలని విన్నవించిన వెంటనే డిప్యుటీ సిఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిలు స్పందించి బస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అర్టీసీ అధికారి జితేంద్రారెడ్డి, టుడిపో మేనేజర్ రూపశ్రీ, అసిస్టెట్ మేనేజర్(ట్రాఫిక్) ఆల్తాఫ్, ఎంపిపి శ్యామల, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పిటిసీ అన్బుగలన్, మండల వైకాపా కన్వీనర్ తులసీ యాదవ్, తహసిల్దారు బాబు, ఎంపిడిఓ విద్యావతి, ఎస్ఐ సురేష్, విఆర్‌ఓలు,పంచాయతీ సెక్రటరీలు, పార్టీ నాయకులు, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై బాలిక మృతి

**-తక్షణ ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**



రేణిగుంట, నవంబరు 24 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్‌లో 11 సంవత్సరాల బాలిక ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గరై గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చిన్నారి అంతిమ సంస్కారాల కోసం కుమారుడు ఆకర్షరెడ్డి ద్వారా పదివేలు అందజేశారు. తారకరామానగర్‌కు చెందిన ఐశ్వర్య(11) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తారకరామానగర్ వైకాపా ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి (ఎంఎస్ఆర్) విషయం తెలుసుకుని హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యవచనాలు చెప్పి సహాయ సహకారాలు అందజేశారు. ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడంతో పదివేల నగదును అంతిమ సంస్కారాల కోసం కుమారుడు ఆకర్షరెడ్డి ద్వారా కుటుంబ సభ్యులకు పంపారు. ఆకర్షరెడ్డి అక్కడ చేరుకుని పాప పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఎమ్మెల్యే పంపిన పదివేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

## చంద్రబాబును కలసిన తెదేపా సర్పంచులు



కుప్పం, నవంబర్ 24 ప్రభాతవార్త : తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయు డును గురువారం కుప్పం నియోజకవర్గంలోని పంచా యతీ సర్పంచులు పలువురు కలిశారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను చంద్రబాబుకు వివరిం చారు. అలాగే పంచాయతీకి వచ్చిన నిధులను వెనక్కు తీసుకోవడం, విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఆదేశించడంతో వచ్చిన నగదు అంతా బకాయిల చెల్లింపులకు ఇచ్చేస్తే పంచాయతీలకు నిధులు మిగిలేది శూన్యమని చంద్రబాబుకు సర్పంచులు వివరించారు. పంచాయతీలకు నిధుల సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం చం ద్రబాబు నాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరలా తెదేపా అధికారంలో రావడం ఖాయమని పంచాయతీల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సర్పంచులను చంద్రబాబు ఆదేశించారు. కార్యక్రమాల్లో సర్పంచులు జెకె సంతోష్, ధనశేఖర్, రాజేంద్రన్, జనార్థనరెడ్డి, రోహిత్ రవి, జనార్ధనరెడ్డి, ఎల్లప్ప, బంగానత్తం ఎంపిటిసి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి : కమిషనర్



రేణిగుంట, నవంబరు 24 ప్రభాతవార్త: సోలార్ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి జనవరిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఏర్పాటు చేస్తున్న గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్లాంట్‌ను గురువారం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సుమారు రూ.25 కోట్ల స్మార్ సిటీ నిధులతో 26 ఎకరాల్లో ఈ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్లాంట్ పూర్తి అయితే 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులు డిసెంబర్ మాసంతానికి పూర్తిచేసి జనవరి నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలాగే ప్లాంట్ చుట్టూ ప్రహరీ గోడ పూర్తి చేయాలని, ప్లాంట్ మధ్యలోఎక్కడా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్‌తో పాటు మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్, సుధీర్ తదితరులు ఉన్నారు.

## గురు దక్షిణామూర్తికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి,నవంబర్ 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కంచుగడపకు ఎదురుగా దక్షిణాభిముఖుడై వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో హోమాలు ఏర్పాటు చేసారు.కలశ స్థాపన జరిపి ప్రత్యేక పూజలు జరిపారు.శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. తరువాత దక్షిణామూర్తికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ్ళ, పన్నీరు, పసుపు, గంధం, విభూదీతో అభిషేకించారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణవేద మంత్రాల ఘోషతో మార్మోగింది. స్వామి వారికి 108దీపాలతో పర్వత హారతి,చక్ర హారతి, కుంభ హారతి,మహామంగళ హారతులిచ్చారు.ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



కాణిపాకం, నవంబర్ 24 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు రాజమ ండ్రికి చెందిన గోపాలకృష్ణ అనే భక్తుడు 1,00,116 రూపాయలను చెక్ రూపంలో సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌ప్పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

చిత్తూరు, నవంబర్ 24 ప్రభాతవార్త: చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తేనెబండ గ్రామంలో ఓ యువతి అదృశ్యం అయ్యింది. తెనెబండలో నివాసం వుంటున్న పూజిత(19) టెన్త్ వరకు చదువుకొని ప్రస్తుతం ఇంట్లోనే వుంటుందని ఈ మేరకు బుధవారం రాత్రి 10 గంటల నుండి ఆమె కన్పించడం లేదని కుటుంబ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.